రాజస్థాన కుసుమము

పి. వి. రామచంద్రమూర్తిగారు బి. ఏ.

ఉదయపుర రాణాయగు భీమసింహునకుఁ గృష్ణకుమారియను పుత్రిక కలదు. ఆమె సుమారు పదునాఱు వత్సరముల వయస్సు గలది. ఆమె రాజపుత్ర యువతుల నెల్లఁ జక్కఁదనమున మించి, రాజస్థాన కుసుమమని వన్నెకెక్కినది.

జైపూరు సంస్థానాధీశుఁడగు జగత్సింహుఁడు కృష్ణకుమారిని దనకిచ్చి పరిణయము గావింప వలెనని యుదయపుర రాణాను గోరెను. రాణాయును నందులకు సమ్మతించెను. జగత్సింహుఁడు తన పుణ్యము ఫలించినదని సంతసించుచు రాజపుత్రి కుచితమగు కానుకల నొసఁగి రమ్మని మిత్రునొకని సపరివారముతో నుదయపురమునకుఁ బంపెను.

మార్వారును పాలించు రాజా మానసింహుఁడు రాజస్థాన కుసుమమును వరించి, ఆమె నెట్లైనఁ బరిణయమాడఁ జూచుచుండెను. రాజా మానసింహు డతిపరాక్రమవంతుఁడు. ఆతని కాఫ్గనులును మహారాష్ట్రులును నవసరమగు నెడ సాయమగుటకు సిద్ధులై యుండిరి. ఆతఁడు కృష్ణకుమారినిచ్చి జగత్సింహునకుఁ బరిణయము గావింపఁ బ్రయత్నములు జరుగుచున్నవని గ్రహించి, తన సైన్యము నుదయపురికిఁ బంపెను. మార్వారు వీరులముందర నిలువలేక యుదయపుర సైనికులు పరుగెత్తసాగిరి. జయపురమునుండి యమూల్యాభరణములఁ దెచ్చిన రాయబారి పిక్కబలము చూపవలసి వచ్చెను.

అది గాంచి జగత్సింహుఁడు సైన్య సమేతుఁడై పోయి మానసింహుని రాజధానియగు జోధపురమును ముట్టడించెను. కాని యాతఁడు సంపూర్ణ పరాజయము నొంది పాఱిపోయెను.

మానసింహుఁడు పఠాను నాయకుఁడగు అమీర్ఖానును రాయబారిగ నుదయపురికిఁ బంపెను.

భీమసింహుని యవస్థ ముందుకుఁ బోయిన గోయి వెనుకకు మరలిన నూయివలె నుండెను.

అంతఃపురవాసిని యగు కృష్ణకుమారి యెప్పటి యుదంత మప్పుడు తెలిసికొనుచుండెను. జోధపురమునుండి యమీర్ఖానుఁ డేగుదెంచెనని యామె యెఱుగును. నాఁ డాతఁడు రాణాతోఁ బ్రసంగించును. మానసింహుని తన యల్లునిగఁ జేసికొన రాణా యొప్పుకొనకున్నచోఁ గ్రూరుఁడును పరాక్రమవంతుఁడును నగు జోధపుర నాయకుని సైన్య ముదయపురమును ముట్టడించి సర్వము నాశముఁ జేయును.

కృష్ణకుమారిమానస మాందోళనకు లోనైనది. తన్ను జైపురాధీశునకిచ్చి వివాహము సేతునని వాగ్దత్తముఁ జేసిన రాణా మానసింహునితో నెట్లొడంబడి కసు రాఁగలఁడు? తన జనకునకు సంభవమైన దుర్భరావస్థ యామెకు గోచరమైనది. మానసింహుఁడు బలీయుఁడు. ఆతనికి మహారాష్ట్ర నాయకుఁడగు సింధియా తోడగును. పఠాను నాయకుఁడగు నమీర్ఖానుఁ డాతని కుడిభుజమై మెలఁగును. తమ రాజ్యమందు గలవారిలోఁ బెక్కురు శత్రునితోఁగూడి రాణాపై గత్తిగట్టఁ జూచుచున్నారు. కనుక రాణా మానసింహుని కోర్కె నెఱవేర్చుట శ్రేయస్కరము. కాని హతాశుఁడైన జగత్సింహుఁడు నాటినుండియు యుదయపుర రాణాకుఁ బ్రక్కబల్లెమై మెలఁగును. కృష్ణకుమారి నిట్టూర్పు పుచ్చి, "జనకా, నా సౌందర్యమును జూచి మురిసిపోయితివి. కాని నా సౌందర్యమే నిన్ను విపజ్జలధి ముంచనున్నది." అని తలపోయఁ జొచ్చినది. కలత జెందిన హృదయముతో నామె యిటునటులు పచారు సేయఁజొచ్చినది. ఆమె హృదయ మతిరయమునఁ గొట్టుకొనుచున్నది. అది ప్రయ్యలు గానున్నదా? 'అట్లుజరుగుట సుఖప్రదమే' అని యామె తలంచెను. రాజ సభామందిర మామె తలఁపున వచ్చెను. ఆ పెకర్మ మెట్లున్నదో నాఁడు తెలుసును. రజిత స్తంభములపై నాధారపడియున్న చాందిని మాణిక్యమయమై యొప్పుచుండ గ్రింద

గల గద్దెపై రాణా కూర్చుండి యుండును. ఆ మహనీయుని కిరుపార్శ్వముల సామంతులలో ముఖ్యులాసనముల నలంకరింతురు, తక్కుఁగల నాయకులెల్ల రుచితాసనముల నధిష్ఠింతురు. క్రూరహృదయుఁడగు నాపఠాను రాణా కెదురుగా నిలువఁబడి, "ఎట్లునిశ్చయించిరి?" యని అడుగును. పాపమామె నిరపరాధిని. ఆమె కెవ్వరన్నను బగసాధించు బుద్ధిలేదు. కాని యామె నిమిత్తమై జయపురమునకును జోధపురమునకును పోరు ఘటిల్లినది. ఉదయపురమునకు మహోపద్రవము రానున్నది. ఇట్టితలపు లానుకుమారి మానసవీధిని పరంపరలుగ రాఁజొచ్చినవి. ఆమెశరీరము భయముచేఁ గంపింపసాగెను.

ఆమెకు క్షణములు దినములుగ మాఱుచున్నవి. ఆమె మానసమును జిక్కఁబట్ట బ్రయత్నించునుగాని ఫలముగుపడదు. ఆమె తలఁపు లన్నియు సభామందిరమునకే పోఁజొచ్చినవి.

ఆమె యత్యాతురతతో నేమియుఁ దోఁచక పచారుచేయుచున్న యాప్రాసాదమున మహారాజ్ఞి దక్క నొరులెవ్వరును లేరు. ఆదేవేరి కుమారింగాంచి 'అమ్మాయి, విచారించిన నేమిఫలము? కానున్నది తప్పింప నెవరితరము?' అని ధైర్యవచనములఁ బలుక సాగెను. కాని యామెయే శోకము నాపుకొనజాలక కంటఁ దడిపెట్ట జొచ్చెను.

కృష్ణకుమారి జననియొద్దకుఁబోయి, 'అమ్మా! నాకుఁ బరిణయమే లేకున్న సౌఖ్యముసుమా! జననమొంది నేటివరకును పెరిగిన యీసౌధములందే యాజన్మాంతము కాలముగడపుదును. అయ్యో! నా చక్కఁదనము చూపఱకెల్లఁ గామోదముగొల్పుచు నాకును సౌఖ్యదాయకమైయుండునని తలఁచితినే కాని, జనకుని, నుదయపురసంస్థానమును నాపదలందు ద్రోయుననుకొనలేదు.' అని పలుకసాగెను. 'తండ్రిగారు నన్ను మానసింహున కొసఁగినచో రణము తప్పును గదా! రాణాయట్లుచేసి హృదయమునకేల శాంతిని దెచ్చుకొనరాదు?' అని తల్లి నామె యడుగఁ జొచ్చెను.

కృష్ణకుమారి శిశోదయవంశమున జనించినది. సత్కులసంజాతులగు రాకొమరులుగాని యామె పాణిగ్రహణమున కర్హులుగాఁజాలరు. జగత్సింహుఁడున్నతవంశమునఁ బుట్టినాఁడు. కనుకనే యాతఁడు తగినవరుఁడని రాణా వాగ్దత్తము చేసినాఁడు. హీనకులుఁడును క్రూరుఁడును నగు మానసింహునకుఁ గృష్ణకుమారి నెన్నటికి నియ్యఁజాలఁడు. ఈవిషయము లన్నియు నాబాలిక చక్కఁగా నెఱుఁగును. జనకుఁ డావిపజ్జలనిధినుండి దాటుట కుపాయము నాలోచించుచున్న యామె ఆందోళనలో నాప్రశ్న వేసినదే కాని పరిస్థితు లామె యెఱుఁగక కాదు.

'కుమారీ! నిన్ను మాత్ర మాక్షుద్రదేవతకు రాణా బలినియ్యఁజాలరు. ఈకష్టమునుండి తప్పించుకొనుట కేదియో యుపాయమును వారన్వేషించుచు నేయుందురు.' అని రాణి కృష్ణకుమారితోఁ బలుకసాగెను. గాని యాబాలికకు మాత్ర మట్టి ధైర్యము గన్పడ దాయెను.

'ప్రొద్దుపోవుచున్నది. రాజమందిరమునుండి సమాచారమేమియు రాలేదు. దూరమున నేదియో కలకలము వినవచ్చెను. కృష్ణకుమారి మేడమీఁది ముందు చావడిలోనికిబోయి తెరల నొత్తిగిలచేసి యటునిటు కలయఁజూచెను. రాజసభామందిరద్వారమున జనులు గుంపులుగా నిలువఁబడిరి. ముతుక వెల్లదుకల కురుచ గడ్డముగల యమీర్షానుఁడు గుఱ్ఱము నెక్కుచుండెను. క్రౌర్యమును దెల్పు నాముఖమునఁ జిఱునగవంకురించు నాపఠానుఁడు వెనకకుదిరిగి ద్వారమున నిలువబడి యున్న ప్రధానునొద్ద సెలవుగైకొనెను. కృష్ణకుమారి యాతని గాంచినది. ఆమె మేనుకంపించినది. వాఁడామెను జూచి యుండఁడు. కాని వాఁడామె వక్షమున నొకబాకు గ్రుచ్చినట్లామెకుఁ దోఁచినది. ఆమె యొక్కపరుగున జననియొద్ద కేతెంచినది.

ఆమె లోనికి వచ్చునప్పటికి గుమ్మమునొద్దగల పరిచారికలు సద్దుసేయసాగిరి. రాణీ కారణమడుగ రాణా యంతఃపురమున కేతెంచుచున్నాడని తెలియ వచ్చెను.

935

రాణా భీమసింహుఁడు ఆగదిని ప్రవేశించెను. అతని ముఖమున శోకము మూర్తీభవించి నట్లుండెను. అతఁ డీవరలోవలె వచ్చుటతోడనే ప్రేమవాక్యములఁ గృష్ణకుమారీని బలుకరింపలేకపోయెను.

కృష్ణకుమారి ముందున కేతెంచి జనకునకు నమస్కరించెను. రాణియు వచ్చి ఆమెప్రక్కనే నిలువఁబడెను. వారెవ్వరును మాటలాడనేరరైరి. భీమసింహుఁ డొక నిట్టూర్పుపుచ్చి, ప్రక్కనున్న యాసనముపైఁ జతికిలఁబడెను. ఆ నిశ్శబ్ద మతిఘోర వృత్తాంతముకన్న భయంకరమై యొప్పెను.

నిర్భాగ్యుఁడగు రాణా తుదకు శిరమునెత్తి కంపమానగాత్రుఁడై కుమారింజూచి 'అమ్మా, ఇటురమ్మ' అని పిలిచెను.

కృష్ణకుమారి జనకుని సమీపించి మోకాళ్లపై నిలువఁబడినది. అమీర్ఖానుని పోఁక నామె గాంచినప్పుడే యామె యొక వింతభయమునకు లోనైనది. రాణా ముఖము నామె గాంచినప్పుడు ఆవేదన కామె రూపము నియ్యఁగల్గినది.

'తండ్రీ! ఏల పలుకసందేహింతురు? రాజా మానసింహునకు నన్నిచ్చి పరిణయముసేయ నిశ్చయించితి ననియే గదా మీరు దెలుపవచ్చినది!' అని యామె నెమ్మదిగా నడిగెను.

రాణా 'ఔన'ని తెలుపు శిరమునూపెను. తన జనకుఁ డా యుగమునకుఁ దన్ను ముడిపెట్టుట కొడంబడినాఁడు. ఇంతకన్న నింక దారుణ మేమిగలదు? కాని రాణా కన్యమార్గ మేదియు లేదుగదా? మానసింహుఁడు తన కామె యర్పింపఁబడనిచో నుదయపురము నొక్క నిమిషమున నేలపాల్సేయును. మానసింహుని యంతఃపురమున నామె యెట్లు నివసింపఁ గలదు? శిశోదయవంశధర్మము నశింపవలసినదేనా? జయపుర రాజునకు రాణా యొనర్చిన వాగ్దానము మాట యేమి?........ఇన్నివిధములఁ దలపోసి యేమిలాభము? రాణా పరిస్థితుల నాలోచించియే తన యంగీకారము నమీర్ఖానున కొసగినాఁడు.

రాణా కన్యమార్గము లేకయే యిట్లొనర్చినాఁడు. ఏమి? రాణా కన్యమార్గము లేదా? కృష్ణకుమారి మానసమం దొక్క తలపు విద్యుల్లతవోలె మెఱసినది.

'తండ్రీ! నన్నుగూర్చి గదా యిట్టి సంక్షోభము కల్గినది? నే మరణించినచో శాంతి సమకూరును' అని యామె పలికినది.

ఆమె జనని ఆ పలుకులందలి యర్థమును గ్రహింపనిదానివలె వెఱ్ఱిచూపుల నామెపై బ్రసరింపఁ జేసెను.

'కనుక నా ప్రాణము అర్పింతును.'

రాజపత్ని కెవ్వుమని యఱచుచు నేల కొఱగుచుండెను. కృష్ణకుమారి జనని పడిపోకుండఁ బట్టుకొనుచు 'అమ్మా! ఎందుకీ యధైర్యము? ఉదయపురమునకు శాంతి సమకూరుటయే నా యాశయము. నే జీవించియుండి సుఖింపలేనుగదా? అని యామెకు నచ్చఁజెప్పఁ బ్రయత్నించెను.

జనని కా పలుకులు వినపడలేదు. 'అమ్మాయీ! మన కుదయపురము యమసదనమువంటిది. మన కిచ్చట నేమిపని? దీనివిడిచి కొండలకుఁబోయి సుఖముగాఁ జరింతము. రమ్మ' అని యా భీరువు కేకలు వేయుచుఁ గుమారికొంగునుబట్టి యీడ్చుకొని పోసాగెను.

కుమారి జననిని భుజముపైన నానుకొనఁజేసి మెల్లగా నామెను ప్రక్కగదిలోనికి దీసికొనిపోయి అచటఁగల పరిచారికలతో నామెకుఁ దగిన విశ్రాంతిని గలుగఁజేయవలెనని చెప్పి, ఆమె నచటవిడిచి, రాణాయొద్దకు శరవేగమునఁ దిరిగివచ్చెను.

కుమారి రాణాకెదురుగా నిలువఁబడి, ఆమె వక్షమున దాచియుంచిన తళుకు తళుకుమను బాకునుదీసి 'రాచబిడ్డ రాజపుత్త్రిల హస్తములనే మరణించుటుత్తమ'మని పలుకుచు, దానిని రాణాకు ముందుంచెను.

రాణా యదరిపడిలేచి, ఆ యాయుధమును గైకొని 'నిన్ను జంపుకొనుటకన్న నే మడియుట

936

మేలు' అని పలుకుచు దానిఁ దన రొమ్మునకు గుజ్జేచేయుచుండెను. కుమారి రాణా హస్తమును బట్టుకొని, 'తండ్రీ, మీరు మడియుటవలనఁ గలుగు మేలు శూన్యము. మీరు మరణించినచో రాజపుత్రవనితల మానధనమును గాపాడువారెవరు? రాణా గతించినచో నుదయపురప్రజల గతియేమి?' యని బలుకుచు నాతని యుద్యమమును మాన్పెను.

'కుమారీ! నీవు వచించినది సత్యము. రాజపుత్రుఁడ నయ్యు, భీతుఁడనై ఆత్మహత్యఁజేసికొని మానవతుల నెల్ల శత్రువులవశము జేయ నుంకించుచున్నాను. నీ ధీరత్వముఁ జూచిన నాకు లజ్జ వొడముచున్నది. కాని, తల్లీ! నీవు గతించినచో నేను జీవచ్ఛవమనై యుండవలెను సుమా!' అని యాతఁడు కంటఁ దడి పెట్టుకొనుచుఁ బలుకసాగెను.

'మహారాణావా రిట్లధైర్యపడు టుచితముగాదు. నేను శిశోదయవంశమున జనించితిని. నా వంశ మతి పవిత్రమైనది. దాని కాపంతయైన వన్నె దఱుఁగనున్నచో శిశోదయులగు స్త్రీ పురుషు లెల్లరును దమ ప్రాణముల ధారవోసి గౌరవమును గాపాడుకొందురు. ఇది మన కులధర్మము. ఈ కులమున జనించిన వనితలెందరో ఈ ధర్మమును బాటించిరి. కాన నే నొనరించు కృత్య మొక క్రొత్త పోకడ కాదు. రండు. ఈ బాకునుగైకొని కులధర్మమునకై నా ప్రాణముల ధారవోయుఁడు' అని ఆమె రాణాను హెచ్చరించెను. అతఁ డట్లే నతికిలబడెను. 'నేనే స్వయముగ నీపనిని నెఱవేర్చుకొనఁగలను. కాని పురుషులే యీకార్యము నిర్వహించి, యా గౌరవమును దక్కించుకొను టుచిత'మని యామె తిరిగి వచించెను.

రాణా హృదయమున వింతలగు తలపులు పుట్టసాగినవి. నిరపరాధినియై ప్రాణములఁగోల్పోవ నిలఁబడియున్న యా కుమారి యాతనికి కేవల మొక బాలికవలెనే కనుపించలేదు. శిశోదయధర్మమెల్ల మూర్తీభవించి తన కుమారియై నిలచినదని యాతఁడు భావింపసాగెను. ఆమె ప్రాణము లర్పింపవలసిన తరుణ మేతెంచినది. మహాత్యాగము సేయ సంసిద్ధురాలైనది.

'కుమారీ! శిశోదయవంశసంజాతమగు నారీలోకమున కెల్ల శిరోరత్నమవీవు. నే నన్నివిధముల నదృష్టహీనుఁడ. కాని నిన్ను గనుటచే నా జన్మము ధన్యమైనది. కులమున కపయశము రాకుండఁజేయఁ బ్రాణములఁ ద్యజించుచుంటివి. నా కట్టిభాగ్య మబ్బలేదు గదా! తల్లీ! నీ యాజ్ఞను శిరసావహించి సజీవుఁడనై యుండి ధైర్యముఁబూని రజపుత్రవనితల మానము గాపాడ రణరంగమునఁ బోరెద. తల్లీ! శిశోదయ రాజపుత్రికలకు మార్గదర్శినివై కీర్తికాయమున నెలయుము. కుమారీ! సంసిద్ధురాలవై యుండుము. రేపటి దినమున శిశోదయవంశమునకు నీ ప్రాణము లర్పించుము. నీ యాత్మకు శాంతి సమకూర, నిద్రింపుము' అని రాణా పలుకుచు లేచెను. కృష్ణకుమారి యాతని యాజ్ఞ నాదలఁదాల్చినది. రాణాయును నంతఃపురమును వీడిపోయెను.

ఆరాత్రి కృష్ణకుమారి నిర్విచారమనస్కురాలై నిదురించినది. మరుసటిదినమున నరుణోదయకాలమున నే మేల్కాంచి, నాఁడు తన కల్యాణదినమని భావించుచు మరణమునకై వలయు ప్రయత్నములఁ జేయఁ దొడఁగెను. ఆమె శ్వేతాంబరధారిణియై, ఫాలమున దిలకమును బాగుగా దిద్దినది. వివిధ పుష్పజాతులచే నామె కేశభారము నలంకరించుకొన్నది. మంచి గంధమును, తావుల వెదజల్లు నత్తరులను మేనబూసికొన్నది. శాంతహృదయయై యాబాలిక యొకచో గూర్చుండి ధ్యానమునకుఁ గడంగినది. ఆసన్నమగు మృత్యువును నిశ్చింత నెదురుచూచుచున్న రాజపుత్రికను గాంచి, అంతఃపురకాంతలెల్ల రచ్చెరువందుచు తాము శోకించుట యుక్తముగాలేదని తలపసాగిరి.

రాణా కన్నకూతుప్రాణములఁ జేతులారఁ దీయఁజాలక తనకు సన్నిహితబాంధవుఁడగు రాజా దౌలత్ సింహుని నంతఃపురమునకుఁ బంపెను. అతని యాగ

937

వనమును విని కృష్ణకుమారి నవ్వుచుఁ దన్ను జుట్టియున్న వనితలనుండి సెలవుగైకొని, తన్ను విడిచి పోండని కనుసన్నఁ దెలియఁజేసెను.

రాజాజ్ఞ ననుసరించి, తన యనుచరులదీయఁ బచ్చిన దౌలత్‌సింహున కామె చిఱునగవుతో స్వాగత మొసఁగెను. అతఁడా యబలకౌతుకమును గాంచి నిర్విణ్ణుఁడైపోయెను. ఆముగ్ధ నాతఁడు చంపఁ జాలఁడు. అతని హృదయము కరఁగిపోయెను. 'రాజాజ్ఞ నుల్లంఘించుటచేఁ గలిగెడు శిక్ష ననుభవింతునుగాని యీ ఘోరమును నే చేయఁజాల'నని పలుకుచు నాతఁడు తన ఖడ్గమును తన్ననుసరించి వచ్చిన మహారాజా జవాన్‌దాసుని హస్తమునకుంచి పోయెను. సౌందర్యవతియగు నాబాల వినమ్రయై నిలువఁబడినది. జవాన్‌దాసు, కృష్ణకుమారి సామాన్యుని ఖడ్గమున కెఱగాఁజాలదని యెఱుంగుటచేఁ దన కాకృత్యము తప్పదని తలంచుచు నామెను సమీపించెను. కాని అతని హస్తము వణఁకసాగెను. మానసము కలఁతఁ జెందెను. అతని చేతిలోనుండి ఖడ్గముజారి క్రిందఁబడినది.

'ఈ కోమలాంగి కట్టి ఘోరమరణమును సమకూర్చుట కెకరినుఁడైన ధైర్యమూనఁడు' అని పలుకుచు నాతఁడును అంతిపురమును వదలిపోయెను.

కుమారి, కరుణాళువులై యా రసపుత్రు లిర్వురును మరలిపోవుటఁగాంచి, విషపానమువలన ప్రాణములఁ గోల్పోవ నిశ్చయించుకొనెను.

ఆమెను చిన్ననాటినుండియుఁ బెంచి ప్రేమించుచున్న యువతు లెందరో యామెవద్ద కేతెంచిరి. ఆమె ప్రాణములకు మారు తమ ప్రాణము లర్పించ వలనుపడిన బాగుగానుండును గదా యని విలపింప సాగిరి. మహాత్యాగము గావింపనున్న కృష్ణకుమారి పరమసాధ్వి. ఆమె దేవత్వమును బొందినది. ఆమెను గాంచినవారి కెల్లరకును భక్తి గౌరవములు కల్గినవి. వారందరామెకు నమస్కరించిరి. తమ బిడ్డల నామెకుఁ బ్రణమిల్లఁజేసి, ఆమె యాశీర్వాదమును బడసి, కన్నీరుగార్చుచు వెడలిపోయిరి.

ఆమె యొంటరిగా నాగదియందుఁ గూర్చుండెను. రాజసేవకుఁ డొకఁడు రజతపాత్రయందు విషముగలిసిన పానీయమును బోసి తెచ్చెను. దాని వెనువెంటనే మహారాణి విలపించుచు నొక్కపరుగున వచ్చి కృష్ణకుమారి హస్తమునుండి యాపాత్రను లాగుకొనఁ బ్రయత్నించెను. కుమారి, జననికందకుండ నాపాత్ర నెత్తిపట్టుకొని 'తల్లీ! విచారింపకుము. సెలవు దయసేయుము. నన్ను మఱచిపొమ్ము' అని పలుకుచు ఆ విషమును సంపూర్ణముగ గ్రోలెను. రాణాపత్ని మూర్ఛిల్లెను. రాజస్థానకుసుమము మెల్లగాఁ గన్నుమూసినది. ఆ నిద్రనుండి యామె మేల్కాంచలేదు.

కృష్ణకుమారి పొందిన దుర్మరణమునుగూర్చి విలపింపని రాజపుత్త్రుఁడు లేఁడు. రసపుత్రులెల్లరును తమ పౌరుషముల మాటుపఱచి, ఇంటఁగూర్చుండి యొక్క సుకుమారిని బలియిచ్చితిమని తెలిసికొన్నపుడు వారికిఁ బొడమిన లజ్జ యింతంతనరానిది. వారెల్లరకును నూతనముగ శౌర్య ముద్భవించినది. ఆమె మహాత్యాగమును బురస్కరించుకొని వారెల్ల రైకమత్యమును జూపుచు శత్రులతోఁ బోరాడి మేవారునకు యశముఁదేఁ బ్రయత్నింతురు.